క్లుప్తంగా

వైభవంగా అమ్మవార్ల జాతర



బి.దొడ్డవరం గ్రామ దేవతలు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, పూజ ఘటం ఊరేగింపు నడుమ జాతరను ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. ఆలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయాన్ని విద్యుత్ దీపాల వెలుగులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలు రకాల బెంగళూరు పుష్పాలతో అమ్మవారి ఆలయాలను తీర్చిదిద్దారు. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, బుధవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

ఘనంగా సామూహిక మాతృ పూజోత్సవం



మామిడికుదురులో సామూహిక పాద పూజలో పాల్గొన్న చిన్నారులు

మామిడికుదురు: భగవాన్ సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ సంస్మరణలో భాగంగా సోమవారం మామిడికుదురు శివాలయం ప్రాంగణంలో సామూహిక మాతృ పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చిన్నారులు తమ తల్లుల కాళ్లు కడిగి పాదపూజ చేశారు. కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు ఏర్పాటు చేసిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. భగవాన్ సత్యసాయి బాబా ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది. కార్యక్రమంలో బాలవికాస్ గురువులు సీహెచ్ భవాని, పి.ఫలదాంబ, అల్లూరు పద్మనాభరాజు, సేవకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు అన్నారు. తొండవరంలో పూడుకుపోయి ఉన్న డ్రైనేజీలను పొక్లెయిన్ సాయంతో సోమవారం శుభ్రం చేయించారు. వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్నీ దృష్టిలో ఉంచుకుని మురుగునీరు దిగేందుకు డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. మురుగునీరు వెళ్లే డ్రైన్‌లో చెత్తా, చెదారం వేయవద్దని స్థానికులకు సూచించారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.16,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన వానపల్లి సత్యనారాయణకి 4 నెలల క్రితం సుగర్ ఎక్కువై ఆపరేషన్ చేసి ఒక కాలు తీసేశారు. ఈయనకి ఇంటి దగ్గర వైద్యం చేయించడానికి డబ్బులు లేక కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. కొడుకుకి పెరాలసిస్ రావడంతో పనికి వెళ్లలేని పరిస్థితి. కుటుంబాన్ని పోషించే వారు ఎవరూ లేక సత్యనారాయణ భార్య స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో సత్యనారాయణ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా చెక్కును అందజేశారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం



ఆలయానికి విరాళం అందిస్తున్న దాతలు

మలికిపురం: మలికిపురం ఎత్తు వంతెన వద్ద నూతనంగా నిర్మించిన శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి వారి ఆలయానికి అప్పనరామునిలంక గ్రామానికి చెందిన దివ్వి ఆదినారాయణ కుమారులు రూ.25,558, మలిపురం గ్రామానికి చెందిన అడపా నరేష్‌కుమార్ దంపతులు రూ.25,558, ఒగ్గు గంగాభవాని రూ.50 వేల విరాళం అందించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులకి విరాళంగా అందజేశారు. పల్లపోతు బంగారం, గుండుబోగుల పెద్దకాపు, వై.ఫణి కృష్ణ, కటికిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మధుర ఫలం.. విషతుల్యం..

- పండ్లను మగ్గబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కెమికల్స్
- రైపెనింగ్ చాంబర్ల ఏర్పాటుపై ఆసక్తి చూపని రైతులు



రసాయనాలతో మాగబెట్టిన మామిడిపండ్లు



మార్కెట్‌లో విక్రయిస్తున్న రసాయనాలతో మాగబెట్టిన అరటిపండ్లు

రావులపాలెం: ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యం ఉంది. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిన నేపథ్యంలో రోజువారీ ఆహారంలో జామ, బొప్పాయి, దానిమ్మ, కమల, యాపిల్, అరటి తదితర పండ్లను తీసుకుంటున్నారు. వైద్యులు, న్యూట్రిషియన్లు సైతం పండ్లు, గింజల (నానబెట్టిన సీడ్స్)ను తినమంటూ అవగాహన సైతం కల్పిస్తున్నారు. శాకాహారం తీసుకునే వారు రోజు మొత్తంలో పండ్లను ఎక్కువగా తింటారు. తినే పండ్లలో ఆరోగ్యశాతమెంతన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తుంది. కొత్తపేట నియోజకవర్గంలో అరటిపండ్ల విక్రయాలు నిత్యం జరుగుతాయి. సీజన్ కావడంతో మామిడి పండ్ల విక్రయాలు సైతం ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్, ఇథిఫాన్‌లిక్విడ్‌లను వినియోగిస్తుండటంతో ఫలాలు విషతుల్యమవుతున్నాయి. పోషకాలతో పాటు విషపదార్థాలు శరీరంలోకి వెళ్లడం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటోంది.

జోరుగా విక్రయాలు

స్థానిక వ్యవసాయ క్షేత్రాలతో పాటు ఇతర ప్రాంతాల పండ్లను మార్కెట్లలో విక్రయిస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట 8,599.65 ఎకరాలు, రావులపాలెం 6,089.64 ఎకరాలు, ఆలమూరు 1,989.86 ఎకరాలు ఆత్రేయపురం 5,761.14 ఎకరాలు మొత్తంగా నాలుగు మండలాలు కలిపి 22,440.30 ఎకరాల్లో ఉద్యాన సాగు విస్తీర్ణం ఉంది. కొత్తపేట మండలంలో 2,322.51 ఎకరాలు, రావులపాలెంలో 2,286.12 ఎకరాలు, ఆత్రేయపురంలో 3,016.20 ఎకరాలు, ఆలమూరులో 437.54 ఎకరాల్లో రైతులు అరటి సాగు చేస్తున్నారు.

రసాయనాల వినియోగం ఇలా..

ఉత్పత్తి అయిన వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైనది. పండు చెట్టుమీదనే పరిపక్వతకు వచ్చాకా తినడమనేది దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకతి సిద్ధంగా ముగ్గబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మగ్గబెడుతున్నారు. మామాడి పండ్లకు కాల్షియం కార్బైడ్ అరటికి ఇథిఫాన్‌లిక్విడ్‌లను స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

సహజంగా పండిన పండును గుర్తించండిలా

సహజసిద్ధంగా మాగిన మామిడి పండ్లు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహించగలుగుతాం. సహజ సిద్ధమైన తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో ముగ్గబెట్టిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్టు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కుదగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

విజిలెన్స్ దాడులు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తుంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపెనింగ్ చాంబర్లలో పండ్లను మగ్గబెట్టి విక్రయించడం మేలు.

నిరుపయోగంగా రైపెనింగ్ కేంద్రం



రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ఉన్న రైపెనింగ్ కేంద్రం

స్థానిక అరటి మార్కెట్ యార్డులో 2016లో సుమారు రూ. కోటి నిధులతో 100 టన్నుల సామర్థ్యం కలిగిన రైపెనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే దానిని రైతులు కాని, చిరు వ్యాపారులు కాని వినియోగించకపోడంతో నిరుపయోగంగా మారింది. అందులో మగ్గబెట్టేందుకు వాడే యంత్రాలు, విద్యుత్ పరికరాలు, జనరేటర్ అన్ని పాడైపోయాయి. ఈ ప్రాంతంలో రైపెనింగ్ కేంద్రంపై రైతులకు, వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



కాల్షియం కార్బైడ్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దాంతో మగ్గబెట్టిన పండ్లు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయి. రోజూ పండ్లు తినేవారు సహజ సిద్ధంగా పండించిన పండ్లు తినడం మేలు. ప్రత్యామ్నాయంగా ఎథిలిన్ హార్మోన్ స్ప్రే చేయొచ్చు. రైపెనింగ్ సెంటర్లు ప్రయోజనకరంగా ఉంటాయి. అరటి ఎగుమతులకు డిమాండ్‌తో కూడిన మార్కెట్ లభిస్తుండటంతో స్థానిక ఉద్యాన రైతులు ఏ రోజుకు ఆరోజు అరటి ఉత్పత్తులను అమ్మేసుకొంటున్నారు. కేంద్రాల నిర్వహణ పట్ల వారు ఆసక్తి చూపడం లేదు.

– జి.కోటేశ్వరరావు, ఉద్యాన శాఖాధికారి, కొత్తపేట

మృతుల కుటుంబ సభ్యులకు చెక్కుల అందజేత



అంబాజీపేటలో దత్తుడుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: ఇటీవల సింహాచలం సింహాద్రి అప్పన్న దేవాలయంలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన అంబాజీపేట కొర్లపాటివారిపాలెం చెందిన పత్తి దుర్గా స్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు చొప్పున చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. పత్తి దత్తుడు, కుంపట్ల శ్రీనివాసరావులను పరామర్శించి చెక్కులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఆర్డీవో శ్రీకర్ అందజేశారు. అంతకుముందు యువకుల చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డీటీ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ వై.ఏడుకొండలు, సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీర రాఘవులు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, కల్వకొలను తాతాజీ పాల్గొన్నారు.

విద్యార్థులు సరికొత్త అన్వేషణలు చేయాలి



కొత్తపేటలో సర్వేశ్వరశర్మను సత్కరిస్తున్న బసవరాజు తదితరులు

కొత్తపేట: విద్యార్థి దశ నుంచీ ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలు శాస్త్రపరంగా అభివృద్ధి పరచుకుని సరికొత్త అన్వేషణలు చేయాలని విద్యావేత్త, సైన్స్ రచయిత డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ ఉద్బోధించారు. స్థానిక రిటైర్డ్ సైన్స్ ఉపాధ్యాయుడు పీవీబీఎస్ బసవరాజు స్వగృహం (సైన్స్ హోమ్)లో 8, 9, 10 తరగతుల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు సైద్ధాంతిక, ప్రాయోగిక భౌతిక శాస్త్రం వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం డాక్టర్ సర్వేశ్వరశర్మను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి, ఆయనతో సైన్స్ అంశాలను బోధించారు. శర్మ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో అగ్రస్థానంలో ఉన్న దేశాలలో భారతదేశం ఒకటన్నారు. ఐటీ, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ వంటి రంగాల్లో భారత్ పురోగమన దిశలో ఉందన్నారు. సైన్స్ ఇన్నోవేటర్ బసవరాజు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచీ భౌతిక శాస్త్ర ప్రయోగాలు చేయడం వలన ఆ శాస్త్ర భావనలు సులువుగా మనసులో నాటుకుంటాయన్నారు. అంతే కాకుండా ఆలోచనలను వస్తురూపంలోకి మలచే చాతుర్యత పెరుగుతుందన్నారు. శర్మను బసవరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రియదర్శినీ బాలవిహార్, సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్స్ అద్దంకి బుద్ధచంద్రదేవ్, ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయండి



మామిడికుదురులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

మామిడికుదురు: ప్రతి రైతు విధిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని అనంతరపురం మోడల్ మేకర్ ట్రినీ ఓబులేసు సూచించారు. ఆయన మామిడికుదురులో ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల విక్రయం స్టాల్‌ను సోమవారం పరిశీలించారు. ఓబులేసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు ఏర్పడవన్నారు. ఈ ఉత్పత్తులను వినియోగించడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని చెప్పారు. ఇప్పటికే చాలా మంది ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులనే వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో వీటి సాగు మరింత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. స్థానికులు ఈలి శ్రీనివాస్, వర్ధినేని వెంకట్రామయ్య, సాపే ఏకాదశి పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, కుసుమ పద్మావతి, జి.లెనిన్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్, నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



రావులపాలెం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం: వేసవిలో ప్రజలకు విద్యుత్, తాగునీరు ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండల సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షురాలు కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఇటీవల పెహల్గాంలో జరిగిన తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన మృతులకు, గోపాలపురం పంచాయతీ సెక్రటరీ నిమ్మకాయల సాయిరాం ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో సభ వారికి సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. బండారు మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈ.మహేశ్వర రావు, తహసీల్దార్ ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందపల్లిలో చలివేంద్రం ప్రారంభం

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానం వేసవి చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. దేవదాయ–ధర్మాదాయ శాఖ డీసీ, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో మందపల్లి పెద్ద వంతెన వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ, శనైశ్చర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, పలువురు గ్రామస్తులు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందనలు

మండల పరిధిలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం వై.చంద్రశేఖరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన నరెడ్ల హారిక, బండారు యశ్వంతి తదితరులను ఎమ్మెల్యే బండారు అభినందించి, స్వీట్ బాక్సులు, షీల్డ్‌లు అందజేశారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ



ర్యాలిలో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న శ్యామ్ కుటుంబ సభ్యులు

కొత్తపేట: జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిని ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో సర్వమత చిన్నారుల సదస్సు తీవ్రంగా ఖండించింది. మహాత్మాగాంధీ స్వాతంత్ర్య ఉద్యమం పురస్కరించుకుని దేశవ్యాప్త పర్యటనలో భాగంగా 1929 మే 5న ర్యాలి గ్రామాన్ని సందర్శించి, విదేశీ వస్తు బహిష్కరణలో పాల్గొన్నారు. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సోమవారం గాంధీ వచ్చిన వేళ అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్యామ్ జాదూగర్, మాయా బడి ఆధ్వర్యంలో అనూస్ హౌస్, మ్యాజిక్ హోంలో చిన్నారులతో ప్రపంచ శాంతి సదస్సు నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ చిన్నారులతో ప్రపంచ శాంతి సదస్సు నిర్వహించారు. పలువురు చిన్నారులు మాట్లాడుతూ కశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడిని తీవ్రంగా ఖండించారు. ముందుగా గాంధీ సెంటర్‌లో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

అయినవిల్లి: పెహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నేదునూరులో రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. జమ్ముకశ్మీర్ నుంచి వచ్చిన ఆర్‌ఎస్‌ఎన్ ప్రభాకర్, పప్పు విశ్వనాథం ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. వీరు మాట్లాడుతూ కశ్మీర్ ఉగ్రదాడితో యావత్ భారత జాతి ఉలిక్కి పడిందన్నారు. ఈ ఘటన నుంచి హిందువులను జాగృతం చేయాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద కేంద్ర, కన్యాకుమారి ప్రతినిధి సి.సదాశివరాలు, వివేకానంద, సేవా సమితి కార్యదర్శి గొవ్వాల నాగరాజు, పాలగుమ్మి వెంకటకృష్ణ, అయ్యగారి వెంకటేశ్వరరావు, కొమ్ముల రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ మృతి



బుడితి భాస్కర్ (ఫైల్)

కొత్తపేట: మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి విజయభాస్కర్ (31) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొత్తపేట మండలం పలివెల చినపేటకు చెందిన భాస్కర్ ఈ నెల ఒకటిన బైక్‌పై వెళుతుండగా కొత్తపేట దేవీసెంటర్ మలుపు వద్ద తెలంగాణ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం రాజమహేంద్రవరానికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మృతుడు భాస్కర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. విజయభాస్కర్ మృతికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భాస్కర్ మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి, పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

సారా రహిత గ్రామం అందరి లక్ష్యం

కొత్తపేట: గ్రామంలో సారా ఛాయలు కనిపించకుండా మా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామస్తులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు మాటిచ్చారు. సోమవారం గ్రామంలో సారా నిర్మూలన సదస్సు నిర్వహించారు. కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో సర్పంచ్ వేములశ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సదస్సులో అమలాపురం ఏఈఎస్ జి.అమర్‌బాబు పాల్గొన్నారు. పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, బాగోగుల దృష్ట్యా తమ గ్రామంలో సారా తయారుచేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు ఎవరు పాల్పడినా వారిని తాము నిలువరించి ఎక్సైజ్ అధికారులకు అప్పగిస్తామని, తద్వారా సారా రహిత గ్రామంగా తీర్చి దిద్దుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కే అన్నవరం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాయిరామ్‌కు ఘన నివాళులు



సాయిరామ్‌కు నివాళులు అర్పిస్తున్న సంఘ నేతలు

ఆలమూరు: జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ నేత నిమ్మకాయల సాయిరామ్ (58) సంస్మరణ సభ జరిగింది. ఆలమూరులోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించిన దశ దినకర్మ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన పలువురు జిల్లా అధికారులు, సంఘ నేతలు విచ్చేసి సాయిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రావులపాలెం మండలంలోని గోపాలపురం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఈయన ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు.

నేడు మెగా జాబ్‌మేళా

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల ఆరో తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏ1 సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా వికాస మేనేజర్ గొల్ల రమేష్ తెలిపారు. మెగా జాబ్‌మేళాలో 37 కంపెనీలు 1547 ఖాళీలను భర్తీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన 30 ఏళ్ల వయసున్న నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. నిరుద్యోగులు రెజ్యూమ్ సాఫ్ట్ కాపీతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు. డిగ్రీ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూల నిర్వహణ గదులు, రిజిస్ట్రేషన్ డెస్క్‌లు, కంపెనీ బూత్‌లు, వెయిటింగ్ ఏరియా వంటి సదుపాయాలు కల్పించామన్నారు. మెగా జాబ్‌మేళాను ఏ1 సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు సహకారంతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏజీపీగా రజిత



రాజోలు: రాజోలు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా న్యాయవాదిగా గుబ్బల రజిత నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని రజిత తెలిపారు. 2004లో న్యాయవాద వృత్తి చేపట్టిన ఆమె 2014 నుంచి రాజోలు కోర్టులో లీగల్ ఎయిడ్ కౌన్సిలర్‌గా, లోక్ అదాలత్ మెంబర్‌గా, మీడియేటర్‌గా సేవలందించారు. ప్యానల్ న్యాయవాదిగా పలు గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మూడేళ్ల పాటు ఏజీపీగా కొనసాగుతారు. ఏజీపీగా తన నియామకానికి కృషి చేసిన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఏజీపీగా నియామకమైన రజితను రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అభినందించారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన



పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ భీమారావు

అయినవిల్లి: పారిశుధ్యం నిర్వహణపై సమగ్ర చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ జి.భీమారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 21 గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ భీమారావు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను సేకరించాలన్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

సామాజిక బహిష్కరణపై చర్యలేవీ!

మలికిపురం: పిఠాపురం నియోజకవర్గం మల్లంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన నేరం ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటని రాజోలు నియోజక వర్గ పరిరక్షణ సమితి ప్రశ్నించింది. ఈ మేరకు సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. ఘటన జరిగిన సమయంలో సామాజిక బహిష్కరణపై గానీ, జల్లిబాబు ఇంటిలో జరిగిన విద్యుత్ ప్రమాదంపై కానీ స్థానిక పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు ఏ విధమైన కేసులు నమోదు చేయలేదని సమితి సభ్యులు ప్రశ్నించారు. అనంతరం అమలాపురం కలెక్టరేట్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. చింతా సత్య, మంద సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

రాజోలు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ సంఘ నాయకులు సోమవారం రాజోలు తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం, పీడీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వారానికి 32 పిరియడ్స్ వర్క్‌లోడ్ మించకుండా స్టాఫ్ ప్యాటర్న్ రూపొందించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ రహీం, జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్యాంసన్, నాయకులు ఎండీ కె.మొహిద్దీన్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన బొక్కా వెంకటేశ్వరరావు రూ.10 వేలు, అమలాపురానికి చెందిన నక్క చిట్టిబాబు–లలిత రూ.10,001 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్‌లో విస్తృతంగా జరుగుతున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. ఆలమూరులోని బోణువు చెరువు పూడికతీత పనులను సోమవారం సర్పంచ్ నేలపూడి లావణ్య, ఎంపీడీఓ రాజు ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన కూలీలందరికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రూ.26.9 లక్షలతో దాదాపు ఏడు వేల పని దినాలను మంజూరు చేశామన్నారు.